క్లుప్తంగా

బంజార కమిటీ ఏకగ్రీవం

లింగాల: మండల కేంద్రంలోని మేరమ్మ ఆలయ ఆవరణలో సోమవారం ఆల్ ఇండియా బంజార లింగాల గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు కేతావత్ హతిరాంనాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాంనాయక్, ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణనాయక్, ఉపాధ్యక్షుడిగా సంతోష్, ప్రధాన కార్యదర్శిగా బోజ్యానాయక్, కోశాధికారిగా కేతావత్ మురళీ, కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆర్థికసాయం అందజేత



మన్ననూర్: పూరి గుడిసె అగ్నికి ఆహుతై నిరాశ్రయులైన రాంపూర్ చెంచుపెంటకు చెందిన అంకులయ్య కుటుంబానికి సోమవారం రూ: 12 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారం రోజులు క్రితం అటవీ లోతట్టు ప్రాంతంలోని రాంపూర్ పెంటలోని అంకులయ్య పూరి గుడిసె దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న శంకరయ్య, విజయ్‌భాస్కర్, లింగస్వామితో పాటు మరి కొందరు స్పందించారు. బాధితుడు అంకులయ్యను మన్ననూర్‌కు పిలిపించి అంబేద్కర్ గ్రంథాలయం భవనంలో నగదు అందజేశారు.

అంబేద్కర్ సంఘం ఎన్నిక

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావిలో అంబేద్కర్ యువజన సంఘాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా శ్యామ్, బాలకిష్టయ్య, ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ, బాలస్వామి, కార్యదర్శులుగా కృష్ణయ్య, రాములు, కోశాధికారి శ్రీరాములు, సభ్యులను ఎంపిక చేశారు.

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి



వెల్దండ: మండల కేంద్రంలో సోమవారం కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేంద్రమంత్రి పదవిలో ఉండి రాష్ట్రానికి, కల్వకుర్తి ప్రాంతానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, రామకృష్ణ, విజేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించండి

వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్‌కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్ హాజరై మాట్లాడారు. ప్రతి వారం అందిస్తున్న ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌లాల్, ఏపీఎం రాములునాయక్, అధికారులు తదితరులు ఉన్నారు.

కుంటలో పడి ఆవు మృతి

కోడేరు: మండల కేంద్రానికి చెందిన రైతు కావలి పెద్ద బుడ్డయ్య సోమవారం ఉదయం ఎద్దుల బండి కట్టుకొని వ్యవసాయ పొలానికి వెళ్తుండగా ఊరి దగ్గరలో ఉన్న రెడ్డికుంట వద్దకు పశువులను నీళ్లు తాపడానికి తీసుకెళ్లాడు. పశువుల నీళ్లు తాగుతూ ముందుకు వెళ్లి గుంతలో పడ్డాయి. వెంటనే ఆయన కిందకు దూకి కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి వెంటనే రెండు పశువులను కాపాడారు. బండి వెనకాల ఉన్న ఆవు మెడకు తాడు ఉండటంతో లోపల పడి అక్కడిక్కడే మృతి చెందింది. దాదాపు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

నేడు స్టడీ మెటీరియల్ పంపిణీ

కొల్లాపూర్:గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మంగళవారం నక్క వేణుగోపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేయనున్నట్లు కోఆర్డినేటర్ దశరథం యాదవ్ తెలిపారు. పట్టణంలో మహెబూబ్ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు

కొల్లాపూర్: క్రమశిక్షణతో కష్టపడి చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగదీశ్వర్‌రావు అన్నారు. నియోజవర్గంలో గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఆయన ఆదివారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో రవి, ఈశ్వర్, రాజేందర్‌యాదవ్, అన్వేష్‌గౌడ్,శివానందం,గోపి పాల్గొన్నారు.





పెద్దకొత్తపల్లిలో ఇంట్లో పొంగుతున్న పాలు



కల్వకుర్తిలో..



కల్వకుర్తి హనుమాన్‌నగర్‌లో..

అంబరాన్నంటిన సంబరాలు

జిల్లాలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం మకర సంక్రాంతి, సోమవారం కనుమ పండుగ పర్వదినాలను చేశారు. అన్ని మండలాల్లో మహిళలు ఉదయాన్నే ఇళ్ల ముంగిట్లో సర్వాంగ సుందరంగా ముగ్గులు వేసి తీర్చిదిద్దారు. ప్రతి ఇంటి ముందు రంగవల్లికలికలు కనిపించాయి. ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను నవధాన్యాలలో కలిపి ఇంటి ముందు గడపల వద్ద ఉంచారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు పండుగకు ఇంటికి చేరుకోవడంతో గ్రామాల్లోని కుటుంబాలు, బంధుమిత్రులతో కళకళలాడాయి. సంక్రాంతి సందర్భంగా అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయల వద్ద వ్యవసాయ పనులకు ఉపయోగించే ట్రాక్టర్లు, పాడి పశువులకు రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో దేవాలయం చుట్టూ ఎండ్ల బండ్లు, ట్రాక్టర్లు, వాహనాలను తిప్పారు.

– సాక్షి, నెట్‌వర్క్



లింగాలలో అలంకరించిన ఎడ్ల బండ్లను ఊరేగిస్తున్న రైతులు



పెద్దాపూర్‌లో చెన్నకేశవస్వామి ఉత్సవాలకు వెళ్తున్న ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు



అచ్చంపేట మండలంలో..



తెలకపల్లిలో గండదీపాలు తీసుకెళ్తున్న మహిళలు



అమ్రాబాద్ మండలంలో..



అచ్చంపేట పట్టణంలో..



ఇంద్రకల్‌లో ఎడ్ల బండ్ల ర్యాలీ..

భక్తిశ్రద్ధలతో ప్రభోత్సవం

అమ్రాబాద్: స్థానిక అమరేశ్వరాలయం నుంచి ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రభోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పార్వతీ పరమేశ్వరుని చిత్రపటాలు ఉంచి పుర వీధుల గుండా ఊరేగించారు. ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు అనంతరం రాత్రి ప్రభోత్సవాలను ఉమామహేశ్వరం క్షేత్రానికి తీసుకెళ్లారు.

ఉప్పునుంతల: స్థానిక కేదారేశ్వరాలయం నుంచి ఆదివారం రాత్రి ప్రభోత్సవ కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభోత్సం ఉమామహేశ్వరానికి తరలివెళ్లింది. ప్రత్యేకంగా అలంకరించిన డీసీఎంలో ప్రభను గ్రామంలోని వీధుల వెంట ఊరేగించారు. అనంతరం అచ్చంపేట మీదుగా ఉమామహేశ్వరాలయానికి తరలించి భోగమహేశ్వరంలో సోమవారం తెల్లవారుజామున నిర్వహించిన స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉమామహేశ్వర ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో ఉమామహేశ్వరున్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు వీలుగా 8:30 గంటలకు ప్రభోత్సవాన్ని ఊరేగింపు చేసేందుకు బయలుదేరారు. రాత్రి 9 గంటల సమయంలో గ్రామ పురవీధుల్లో ప్రారంభమైన ఊరేగింపు తెల్లవారుజామున 4 గంటల వరకు కొనసాగింది. అంతకు ముందు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, సర్పంచ్ నేనావత్ శ్రీరాం, పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్రాబాద్‌లో ప్రభోత్సవం

ఎంబీ చర్చిలో నూతన కమిటీ ఏర్పాటుకు డిమాండ్



కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఎంబీ చర్చి కొత్త కమిటీ ఎన్నిక రోజురోజుకు పలు వివాదాలకు దారితీస్తోంది. తాజాగ ఆదివారం చర్చిలో చోటు చేసుకున్న పరిణామాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. 2016లో ఎంబీ చర్చిగా ఉన్న దీనిని ఐఎంబీ చర్చిగా కొంత మంది రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ఐఎంబీ చర్చిగా పిలుస్తున్న కమిటీలోని సభ్యులు దీన్ని వ్యతిరేకిస్తూ ఎంబీ చర్చిగా పిలవాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే రెండేళ్లకోసారి ఎన్నుకోవాల్సిన కమిటీని కాల పరిమితి గతేడాది మార్చిలోనే ముగిసిన నేటికి కొత్త కమిటీ ఎన్నిక కాలేదు. చర్చికి సంబంధించిన ఆస్తులను ఆక్రమించుకునేందుకే కొత్త కమిటీ ఎన్నిక లేదని ఇతరులు అంటున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఎప్పటిలాగే చర్చిలో ప్రార్థనల కోసం రెండు వర్గాలు వచ్చారు. ఇంతలో పోలీసుల రంగ ప్రవేశంతో భయానక వాతావరణం నెలకొంది. పోలీసులకు వారికి మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. సమస్యను త్వరగా పరిష్కరించి చర్చిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని క్రైస్తవులు కోరుతున్నారు.

ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

అచ్చంపేట: రాబోయే ఎన్నికలే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి, యూత్ కాంగ్రెస్ జాతీయ ఇంచార్జీ కృష్ణ అవేరా, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. దేశ ప్రజల సమస్యల కోసం రాహుల్‌గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టారని, ఈ పాదయాత్ర ప్రజలకు తెలియజేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. మనం తలచుకుంటే రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే గువ్వల బాలరాజును వనపర్తికి పంపించవచ్చన్నారు. పోలీస్ బలగాలను దించి పోరాటం చేసిన ఘనత యూత్‌కాంగ్రెస్‌కు దక్కిందన్నారు. మీకు ఏకష్టం వచ్చిన తాను ముందు ఉంటానని చెప్పారు. ఎమ్మెల్యే గ్రామాల్లో మహిళ కమిటీలు వేస్తూ ఆ కమిటీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష రుణాలు, ఇంటి స్థలం ఉన్నవారికి మూడు లక్షలు, దళిత బందు ఇస్తామని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల22న బిజినేపల్లిలో లక్ష మందితో గిరిజన సభ నిర్వహిస్తామని, ఈ సమావేశానికి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాజరవుతారని, పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో రమేష్‌బాబు,ఖీలల్,కాశన్న యాదవ్,చత్రునాయక్,రామనాథం,మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

మగ్దూంపూర్‌లో జెండా ఆవిష్కరణ

లింగాల: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రాబోతుందని, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని మగ్దూంపూర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. బూత్ కమిటీలు సమర్థవంతంగా పని చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని సూచించారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



పెద్దకొత్తపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రైతు సంబరాల్లో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం, పెద్దకార్పాములలో సోమవారం అంతరాష్ట్ర బండలాగుడు పోటీలను ఘనంగా నిర్వహించారు. పెద్దకొత్తపల్లిలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. పెద్దకొత్తపల్లిలో అఖిలేష్‌రెడ్డికి చెందిన వృషభరాజులు మొదటి బహుమతి, వనపర్తి జిల్లాకు చెందిన నర్సింహులు వృషభరాజులు రెండో బహుమతి, గోసాయి హరిప్రసాద్ వృషభరాజులు మూడో బహుమతి గెలుచుకున్నాయి. పెద్దకార్పాములలో సోమవారం నిర్వహించిన అంతరాష్ట్ర న్యూ క్యాటగిరి బండలాగుడు పోటీల్లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొని గెలుపొందిన వృషభ రాజుల యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో 9 జతల ఎద్దులు పాల్గొన్నాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అచ్చంపేట రూరల్: పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి ప్లాస్టిక్‌ను పూర్తి నివారిద్దామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం అచ్చంపేటలో డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మొక్కజొన్న పిండితో తయారు చేసిన బయోడిగ్రేడబుల్ కవర్ల స్టాక్ పాయింట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో ప్లాస్టిక్ భూతం అగ్రస్థానంలో ఉందని, ప్లాస్టిక్ వాడటం వల్ల భూమికి, మానవ ఆరోగ్యానికి పెను ప్రమాదంగా మారిందన్నారు. అచ్చంపేటలో ఈనెల 26నుండి పూర్తిగా ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తూ అచ్చంపేట మున్సిపాలిటీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నామన్నారు. పర్యావరణాన్ని కాపాడితేనే భవిష్యత్ తరాలకు మనుగడ ఉంటుందన్నారు. సమాజంలో ప్రకృతిని, భవిష్యత్ తరాలకు తీవ్ర ముప్పును తీసుకొస్తున్న ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని వాటి స్థానంలో బయోడిగ్రేడబుల్ కవర్లను వాడాలని కోరారు. ప్రభుత్వం ఈ కవర్లను ఆమోదించిందన్నారు. ప్లాస్టిక్ కవర్ల ఉపయోగం అలాగే కొనసాగితే క్యాన్సర్ బారిన పడే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, నిర్వాహకులు చంద్రశేఖర్ శర్మ, సంతోష్, మన్నాన్, చందునాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



బయోడిగ్రేడబుల్ కవర్లను ప్రదర్శిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

కాంగ్రెస్ నాయకులకు సన్మానం

వెల్దండ: మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ నాయకుడు కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిలకు సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అచ్చంపేట నియోజకవర్గంలో నిర్వహిస్తున్న యూత్ జోడ్ బూత్ కార్యక్రమానికి వెళ్తున్న వారు మండల కేంద్రంలో ఆగి కార్యకర్తలతో మాట్లాడారు.

దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

మన్ననూర్: వినాయక చవితికి చందా డబ్బులు ఇవ్వనందుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై మనువాదులు దాడి చేయడంతో పాటు ఉపాధ్యాయ పోస్టు నుంచి సస్పెండ్ చేయించడం దురదృష్టకరమని, అందుకు అంబేద్కర్ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం వివేకానంద విగ్రహం వద్ద సమావేశమై మాట్లాడారు. మనువాదులు రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కరిస్టులపై భౌతిక దాడులకు బరితెగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినాయక చవితి ఉత్సవాలకు చందా డబ్బులు ఇవ్వనందుకు మల్లికార్జున్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై మనువాదులు దాడి చేసి అధికారుల వద్ద వారికి ఉన్న అంగబలంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేయించారన్నారు. అదేవిధంగా నాస్తికవాది బైరి నరేష్ భావస్వాతంత్ర హక్కును కాలరాస్తూ అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపించారని అన్నారు. అదేవిధంగా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు రెంజర్ల రాజేష్ ఇంటిపై దాడి చేయడం మనువాదుల అహంకారానికి నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యతతో మనువాదులకు తగిన గుణపాఠం చెప్పి తీరుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, వెంకటయ్య, అంబనారాయణ, బాలకిష్టయ్య, బాలకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

నిజ నిర్ధారణ కమిటీ వేయాలి



వాల్యాను పరామర్శిస్తున్న దళిత సంఘాల నాయకులు

బిజినేపల్లి: మార్కండేయ ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించడానికి వెళ్లిన వాల్యానాయక్‌ను బీఆర్‌ఎస్ నాయకులు కావాలనే దాడి చేసి గాయపర్చారని, ఈ ఘటనపై నిజనిర్ధారణ కమిటీ చేసి చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రెఖ్యాతండాకు చెందిన వాల్యానాయక్‌కు సంఘం ఆధ్వర్యంలో పరామర్శించి, నిందితులను తక్షణమే శిక్షపడాలని కోరారు. శాయిన్‌పల్లి, మహదేవునిపేట చెందిన ప్రజాప్రతినిధులు అధికారం ఉందనే ఇలాంటి దాడులకు పాల్పడ్డారని వారు ఆరోపించారు.కార్యక్రమంలో మహేందర్, రాంచందర్, వెంకటయ్య, కాశన్న తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కల్వకుర్తి టౌన్: క్రీడలు మనిషికి ఎంతో మానసికోల్లాసాన్ని అందిస్తాయని మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో భాగంగా విజేతలకు ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. గ్రామీణప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించటంలో ఇలాంటి టోర్నీలు ఎంతో ఉపయోగపడతాయని వారు తెలిపారు. ప్రథమ విజేతగా నిలిచిన 11 బెల్లట్స్ టీంకు రూ.50వేలు, ద్వితీయ బహుమతి రామాంజనేయ టీంకు రూ.25వేలు అందజేశారు. మ్యాన్‌ఆఫద సిరీస్‌గా జిల్లుకు ఇచ్చారు.



క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, రాఘవేందర్‌రెడ్డి

ఈదమ్మ మాందాత ఉత్సవాలు



పట్టు వస్త్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో ఈదమ్మ మాందాత ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అమ్మవారికి పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బండిశిడి నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతి గొర్రెను పెద్దకర్రకు కట్టి దేవాలయాలను చుట్టు ప్రదర్శన చేయించారు. ఉత్సవాలను చూసేందుకు పరిసరా గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

భక్తిభావంతో మెలగాలి

కల్వకుర్తిరూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాండ్ర గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈదమ్మ, మాందాత జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో పూజలు నిర్వహించారు. తర్నికల్ గ్రామంలో ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

మాయావతి జన్మదిన వేడుకలు

అచ్చంపేట రూరల్: బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదిన వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కేక్‌కట్ చేసి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నాగార్జున పాల్గొన్నారు.

కొల్లాపూర్: మాయావతి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో కేక్‌ను కట్‌చేశారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించారు. మాయావతి నేతృత్వంలో బహుజన రాజ్య స్థాపనకు పోరాడుదామని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ మౌలానా షఫి మసూద్, కృష్ణయ్య, శేఖరయ్య, బ్రహ్మయ్య, వెంకటేష్, వెంకటేష్‌నాయుడు, మునిస్వామి, విద్యారాణి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న బీఎస్పీ నాయకులు

దేవతామూర్తుల ఊరేగింపు



కొల్లాపూర్: సంక్రాంత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి పట్టణంలో దేవతామూర్తుల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కల్యాణమూర్తులను ఆదివారం రథోత్సవాలపై పట్టణంలోని ఊరేగించారు. మహిళలు కోలాట ప్రదర్శనలు చేశారు. రైతులు కాడెడ్లు కట్టుకుని ఊరేగింపుగా వచ్చారు. ఊరేగింపులో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు పలువురు నాయకులు, రామాలయం, మాధవస్వామి దేవాలయం, బండాయిగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయాల భక్త బృంద కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే

పెంట్లవెల్లి: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జటప్రోలులో ఆదివారం ఎమ్మెల్యే పాదయాత్ర చేస్తూ బస్టాండ్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సబ్ స్టేషన్ వద్ద ఫీడ్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సాగునీరు అందించే కత్వ ఆయకట్టు గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, కత్వను పరిశీలించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడి ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అచ్చంపేట రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అమ్రాబాద్ మండలం కొత్తపల్లికి చెందిన రాంలాల్ అచ్చంపేట నుంచి స్వగ్రామానికి రాత్రి తన బైక్‌పై వెళ్తున్నాడు. రంగాపూర్ శివారులో మన్ననూర్ నుంచి వస్తున్న ఓ వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. కుడి తొడపై వాహనం వెళ్లడంతో తీవ్రంగా రక్తస్రావం అయ్యింది. స్థానికులు గమనించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా ఆర్మీడే

వెల్దండ: మండల కేంద్రంలోని ఆర్మీ భవన్‌లో ఆర్మీ ఆదివారం ఆర్మీడేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్మీలో విధులు నిర్వహిస్తు మృతి చెందిన జవాన్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో దాదాపుగా 40మంది యువకులు ఆర్మీలో చేరి దేశానికి సేవలందించడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ఆర్మీ జవాన్‌లు మట్ట చంద్రశేఖర్‌గౌడ్, శరత్‌గౌడ్, పురుషోత్తంచారి, శ్రీనివాసులు, ప్రవీణ్‌రెడ్డి, మన్సూర్, గణేష్ తదితరులు ఉన్నారు.

